# నవభూమి

## నల్లగొండ

అనుబంధం

18 అక్టోబర్,2024 శుక్రవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in






2

# ఊరికి కీడు

**వేములపల్లి-నవభూమి:** నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామాన్ని గురువారం గ్రామస్థులందరూ మూకుమ్మడిగా ఖాళీ చేశారు.

ఏడాది కాలంగా గ్రామంలో వరుస మరణాలు జరుగుతున్నాయని, ఊరికి కీడు సోకిందనే అనుమానంతో గ్రామపెద్దలు ఒకరోజంతా గ్రామానికి వెలుపల ఉండాలని నిర్ణయించారు. తెల్లవారగానే ఇంటి ముందు కళ్లాపి కూడా చల్లకుండా ఇళ్లకు తాళం వేసి పొలిమేరలో ఏర్పాటు చేసిన నిప్పును తీసుకొని వ్యవసాయ బావులు, భూములు, శివారు ప్రాంతాలకు తరలివెళ్లారు. అక్కడే వంటావార్పు చేశారు. సాయంత్రం తిరిగి ఇంటి బాట పట్టారు. గ్రామంలోని హోటళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు తాళాలు వేయడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గ్రామంలో మొత్తం 1250 కుటుంబాలుండగా సుమారు 5500 జనాభా నివాసముంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 76 మంది పలు కారణాలతో మృతిచెందారు. అందులో 32 మంది యువకులు, 21 మంది 50 ఏళ్లలోపు వారు, 23 మంది వృద్ధులున్నారు. వీరిలో గడిచిన రెండు నెలల్లోనే సుమారు 20 మందికి పైగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

### తరుణ్, శ్రియా శరణ్ సందడి చేసిన

# జీ తెలుగు అవార్డ్స్ 2024 పార్ట్-2

**కరీంనగర్, 17 అక్టోబర్ (నవ భూమి) :** తెలుగు ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించే ఛానల్ జీ తెలుగు. నటీనటులను ప్రోత్సహించేం దుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే 2024 సంవత్సరానికిగానూ ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సు ఘనంగా నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖులు, జీ తెలుగు తారల సందడితో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమం మొదటి భాగం ఇప్పటికే ప్రసారం కాగా, రెండో భాగాన్ని ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను ఈ ఆదివారం మీముందుకు తెచ్చేందుకు సిద్ధమైంది. అలరించే ప్రదర్శనలు, హృదయాన్ని హత్తుకునే క్షణాలు, మరపురాని అనుభవాలతో తెలుగు టెలివిజన్ స్ఫూర్తిని ప్రతిబింబించే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానుంది. తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్ 2 మరోసారి వారిని అలరించేందుకు సిద్ధమైంది. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మేఘసందేశం సీరియల్




నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చింది. యాంకర్వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్తో వీక్షకుల్లో ఉత్సాహంనింపింది. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగింది. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారు. తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫామెన్స్ షోకి హైలెట్గా నిలిచాయి. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మీప్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ,సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రతిష్ఠాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకండి

### రేషన్ బియ్యం పాలిష్ చేసి

# అక్రమ రవాణా


- ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ
- బాపట్ల వాసి చీమకుర్తి సుధాకర్ రేషన్ దందా
- తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని,పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు విక్రయం
- వాడపల్లి చెక్పోస్టు వద్ద తనిఖీల్లో పట్టుబడిన లారీ

**నల్గొండ-నవభూమి:** రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దిన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాలశాఖ అధికారుల కు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.



# చికిత్స పొందుతూ బాలుడి మృతి

**భువనగిరి-నవభూమి:** చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గౌస్నగర్లో గురువారం వెలుగుచూ సింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు(15) భువనగిరిలోని ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న సాయంత్రం గేదెలకు పాలు పితికేందుకు తండ్రితో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పాలకేంద్రంలో పాలు పోసి ఇంటికి తిరిగి వచ్చారు. రాత్రి భోజనం చేసిన అనంతరం కుమారుడు తరచూ ఉమ్ముతుండగా తల్లిదండ్రులు గమనించి ఏమైందని అడగ్గా, వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన కుమారుడు ఒంటరిగా దిగాలుగా ఉండేవాడని తండ్రి తెలిపారు.

## బిజెపి సభ్యత్వ నమోదును పర్యవేక్షించిన జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి



**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 17:**బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మిర్యాలగూడ నియోజకవర్గం మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామపంచాయతీలో నమోదు కార్యక్రమం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గానికి నిర్దేశించిన సభ్యత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ రావు, సీనియర్ నాయకులు బంటు సైదులు, బిజెపి రాష్ట్ర దళిత మోర్చ అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్ మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి సరితలు పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



**మిర్యాలగూడ నపభూమి, అక్టోబర్ 17 :**మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో జడ శ్రవణ్ (19) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. త్రిపురారం మండలం అల్వాల్ పాడు గ్రామానికి చెందిన శ్రవణ్ ప్రేమలో విఫలమై ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతు కే జడంగి

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 17 :**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచి బాధ్యత అప్రమత్తంగా ఉంచి వ్యాధులు నిర్మూలంచేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జడంగి అన్నారు.పురపాలక కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా ఆరోగ్య కేంద్రాన్ని పూర్తిగా అనంతరం ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. మందు నిలువలపై రికార్డులను చూసి ఎక్స్పైరీ డేట్ లో లేకుండా మందులను పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందికి ఆయన సూచనలు జారీ చేశారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ఖచ్చితంగా అమలు చేస్తూ ఉండాలని ఆయనకు తెలిపారు.



### గుంపులు గుంపులుగా కోతులు

# భయాందోళనలో జనం

**పెన్ పహాడ్ ప్రతినిధి అక్టోబర్17( నవభూమి ) :**మండలంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. ఏ గ్రామంలో చూసినా కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళు దుకాణాల్లో తినుబండారాలు, వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోని ఆహార పదార్థాలు వస్తువులు చిందర వందర చేస్తున్నాయి. కిరాణ షాపులు, పండ్ల దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ధ్వంసమవుతున్నాయి. ఆరు బయట ఎండబెట్టిన పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలనూ కోతులు వదలడం లేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి, ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను, పంటలనూ కోతులు వదలకుండా ధ్వంసం చేస్తున్నాయి.భయాందోళనలో ప్రజలు.ఈరోజుల్లో కోతులు బెడద అన్ని చోట్ల ఉంది. గ్రామాలు, పట్టణాలు, పంట పొలాల్లో ఎక్కడైనా వీటి బెడద సర్వ సాధారణం అయిపోయింది. కోతులను అరికట్టడానికి వివిధ రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కానీ పూర్తిగా బెడద తప్పడం లేదు.కోతుల బెడద రోజు రోజుకు ఎక్కువ కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో ఎదురు తిరిగి దాడి చేసి గాయపరుస్తున్నాయి. చాలా మంది కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పెన్ పహాడ్ పీహెచ్సీలో కొంతమంది కోతుల దాడిలో గాయపడి చికిత్స పొందినట్లు వైద్యులు తెలిపారు. కోతుల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు



చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను బందించి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. తాము చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.రణపంగా కృష్ణ, సిపీఎం పార్టీ మండల కార్యదర్శి కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. ఆహార పదార్థాలు, కూరగాయలను ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, ఇతర పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటిని తరిమేందుకు ప్రయత్నిస్తే అవి దాడులకు దిగుతున్నాయి. అధికారులు వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలి.

### సెట్టిపాలెం ఊరికి కీడు కలుగుతుందంటూ

# ఒక్క రోజు వదిలి చెట్ల కిందకు గ్రామస్తులు

**కీడు పోతుందని 12 గంటలు ఊరొదలారు**











**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 17 :** శాస్త్ర, సాంకేతికంగా విజ్ఞానం అద్భుతాలు సృష్టిస్తున్న ఇంకా ప్రజల్లో మూఢ నమ్మకాలు, అజ్ఞానపు చీకట్లు మాత్రం పోలేదు. శాస్త్ర సాంకేతిక రంగాలు కొత్త పరిశోధనలతో ముందుకు సాగుతున్న నేటికీ మూఢనమ్మకాలు గ్రామాలను వీడటం లేదు. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఇటీవల గ్రామంలో వరస మరణాలు సంభవించాయని గట్టిగా నమ్మారు. అనారోగ్యంతో కొంతమంది, రోడ్డు ప్రమాదంలో మరికొందరు, వయసు మళ్ళిన వారు మృత్యువాత పడ్డారని అనుమానం పెను భూతమయ్యింది. గ్రామానికి కీడు దాపరించడంతోనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని భావించిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కీడు పోవాలంటే సూర్యోదయాని కంటే ముందే పిల్ల, పెద్దలతో సహా ఒకరోజు మొత్తం ఊరంతా ఖాళీ చేసి సూర్యస్తయం వరకు ఊరి బయట ఉండాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. దీంతో గ్రామ ప్రజలంతా పొద్దు పొడవకముందే గురువారం తెల్లవారుజాము 5 గంటలకే ఇండ్లు విడిచి తాళాలు వేసి ఊరి పొలిమేర దాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల? ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, దుకాణాలు మూసేసి వెళ్లారు. దీంతో గ్రామం నిర్మానుష్యమైంది, కుక్కల సంచారం తప్ప. పొలాలవద్ద, చెట్ల కింద వంట వార్పు చేసుకున్నారు. దీంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గత పది నెలలలో చిన్న పెద్ద బేధం లేకుండా 70 మంది వరకు గ్రామస్తులు మృత్యువాత పడ్డారని దీనికి గ్రామానికి సోకిన కీడే కారణంగా భావిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన ఉప్పలమ్మ బావిని పూడ్చి వేసిన నాటి నుండి గ్రామానికి కీడు సోకిందని అమ్మవారి ఆగ్రహంతోనే అనర్థాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. కీడు పోవడానికే ఒకరోజు ఊరు విడిచి వెళ్లినట్లు చెప్పారు.

# ధాన్యం కొనుగోలు త్వరగా చేపట్టాలి



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 17 :**గోస్కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటిధనంజయ, రాష్ట్రకిసాన్ మోర్చా నాయకులు సురకంటి రంగారెడ్డి. రైతులు ఆరుకాలం పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలు తీసుకొచ్చి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారని వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ధనుంజయ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి అన్నారు.మండలంలోని గౌస్ కొండ గ్రామంలో గురువారం బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వీరు పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామంలో సభ్యత్వ సేకర నిర్వహించి అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వారు తెలిపారు. కాగా నేడు రాష్ట్రంలో ధాన్యం కోతలు ముగిసిన కొనుగోలు చేపట్టడంలో ప్రభుత్వం కొనుగోలు విషయంలో అలసత్వాన్ని వ్యవహరిస్తుందని తెలిపారు. అకస్మాత్తుగా వస్తున్న వానలతో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే కొనుగోలు చేపట్టి ధాన్యాన్ని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో. జిల్లా సభ్యత్వ ప్రముఖ రాచకొండ కృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు మేకల చొక్కా రెడ్డి, బిజెపి మండల గుండ్ల రాజు యాదవ్, జిల్లా ఓబీసీ అధికార ప్రతినిధి పల్లె కాడి బసవయ్య, ఓ బి సి మండలఅధ్యక్షులు దోసపాటి అంజయ్య,బూతఅధ్యక్షులు దేవేందర్ గౌడ్, నరేష్ తదితరులు ఉన్నారు.

# నిత్యావసర వస్తువుల ధరల పెంపుకు యాద్గారుపల్లిలో నిరసన

### సామాన్యులకు ధరలు అందుబాటులో తీసుకొని రావాలి

### సిపిఎం నేతలు వెంకటేశ్వర్లు, రవినాయక్ డిమాండ్

**మిర్యాలగూడ అక్టోబర్ 17 :**సిపిఎం కేంద్ర కమిటీ మేరకు మిర్యాలగూడ మండలం యాద్గార్పల్లి గ్రామంలో కూరగాయల దండ తో పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎం.రవినాయక్ మాట్లాడుతూ ధరలు నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారని దాని పర్యావసానమే ఈరోజు సామాన్య మానవులు జీవితాలు గుదిబండలాగా మారి పెరుగుతున్న ధరలకు సతమతమవుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ధరలను నియంత్రణకు పూనుకోవాలని కోరారు. దినసరి కూలీ నుంచి మధ్యతరగతి కుటుంబాల వరకు పెరుగుతున్న ధరలకు జీవితాన్ని ఎదురీదలేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం గుడ్డి చెవిటి పాలకులకు అర్థం కావడం లేదన్నారు. సామాన్య మానవుడు పండుగల సమయంలో నిత్యావసర వస్తువుల కోసం కూరగాయల కోసం మార్కెట్లో వెళితే వారు అక్కడున్న ధరలను చూసి బెంబలెత్తిపోతున్నారని అయినా సరే ప్రభుత్వాలు వాటిని నియంత్రణ చేయడం లో పూర్తిగా విఫలమవుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కనేకంటి రామకృష్ణ, సిపిఎం శాఖ కార్యదర్శి వస్కూల సూర్యం, కన్నెకంటి సీతారములు, నీరజ, సైదులు, వెంకన్న, యశోద, పద్మ పాల్గొన్నారు



## నకిలీ క్రిమి సంహారక మందుల దుకాణాలను

# తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు

◆ విక్రయదారులపై పోలీసులకు ఫిర్యాదు





**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 17 :**పంటలపై ఆశించే దోమల, కీటకాల నివారణకు ఉపయోగించే ప్రముఖ సీజెంటా కంపెనీకి చెందిన పురుగుల మందును నకిలీవి విక్రయిస్తున్న మోసంపై ఆ కంపెనీకి చెందిన ప్రతినిధులు బుధవారం మిర్యాలగూడలో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో కొనుగోలు చేసిన పురుగుల మందు నకిలీగా గుర్తించిన కంపెనీ ప్రతినిధులు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయగా గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్ పర్యవేక్షణలో మిర్యాలగూడ ఎడిఏ బి. దేవ్ సింగ్, ఎంఎఓ డి.సైదానాయక్ లు మిర్యాలగూడ, వీర్లపాలెం గ్రామాల్లో తనిఖీలు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేసిన సీజెంటా కంపెనీకి చెందిన నకిలీ పురుగుల మందులు ఎక్కడి నుంచి వచ్చాయని అధికారులు ఆరా తీయగా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామం నుంచి తాము తీసుకొచ్చినట్లు చెప్పడంతో అధికారులు విచారణ జరిపారు. వీర్లపాలెం గ్రామంలోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో తనిఖీలు చేశారు. అలాగే ఒరిజినల్, నకిలీ క్రిమి సంహారక మందులను పరిశీలించారు. మిర్యాలగూడ పట్టణంలోని నాలుగు షాపులతోపాటు వీర్లపాలెం గ్రామంలోని షాపులోను ఈ నకిలీ పురుగుల మందుల విక్రయాలు జరిగినట్లు గుర్తించారు. అయితే ఆ నకిలీ మందులు గుంటూరు జిల్లా దాచేపల్లి నుంచి వీర్లపాలెం వస్తుండగా అక్కడి నుంచి మిర్యాలగూడలోని పలు దుకాణాలకు చేరుతున్నట్లు సమాచారం. తనిఖీలు చేసిన జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్ కుమార్.ఒరిజినల్, నకిలీ పురుగుల మందులను పరిశీలించి దుకాణాన్ని సీజ్ చేశారు. అలాగే శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపిస్తున్నట్లు తెలిపారు. నకిలీ పురుగుల మందుల దందాపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కోరుతూ వాడపల్లి పోలీస్ స్టేషన్ లో స్థానిక వ్యవసాయ అధికారులతో ఫిర్యాదు చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ పురుగుల మందులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పర్యవేక్షణ వైఫల్యం వల్లనే నకిలీ పురుగుల మందుల విక్రయాలు. దాచేపల్లి వయా వీర్లపాలెం టూ మిర్యాలగూడ. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదుతో కదలిక వచ్చింది తనిఖీలు చేసిన జిల్లా అధికారులు. వ్యవసాయ ఆధారిత కృష్ణనది తీర ప్రాంతంలో నకిలీ పురుగుల మందుల దందా రైతులను వెంటాడుతుంది. సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యముతో నకిలీ మందులు రైతులకు అంటగడుతున్నారు. ఎరువుల, పురుగుల మందుల విక్రయాల షాపుల యాజమాన్యాలు సిండికేట్ గా ఏర్పడి వ్యాపారాలు సాగిస్తున్నారు. సంబంధితశాఖ అధికారులను మచ్చిక చేసుకొని నకిలీ దందాలకు తెగబడుతున్నట్టు తెలుస్తుంది. ప్రముఖ కంపెనీలకు చెందిన పురుగుల మందులను నకిలీవి మార్కెట్ లో విక్రయాలు జరుగుతున్న అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. క్రిమి సంహారక మందుల కంపెనీల ప్రతినిధులే నకిలీ మందులను గుర్తించి అధికారులకు ఫిర్యాదులు చేస్తే కానీ తనిఖీలు చేసే పరిస్థితి లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదులు చేయకపోతే నకిలీ దందా వెలుగు చూసే అవకాశం ఉండకపోయేదని రైతులు అంటున్నారు.

# ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

**భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) :** వా నాకాలం 2024-25కు సంబంధించి సన్న, దొడ్డురకం వరి ధాన్యం కొనుగోలును సక్రమంగా నిర్వహించాలని కలెక్ట ర్ హనుమంతు కే.జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి ధాన్యం కొనుగోలుపై మంగళవా రం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దొడ్డురకానికి సం బంధించి 322 కొనుగోలు కేంద్రాలు, 47 సన్న రకం కొనుగోలు కేంద్రాలు మొత్తం 369 కొనుగోలు కేంద్రాల్లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా సన్నరకం ధాన్యానికి రూ.500 బోన్‌సతోపాటు గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తే వాలని, ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల కు చెల్లింపులు జరుగుతాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డురకానికి వేర్వేరుగా రికార్డులు నిర్వహించి మూమెంట్ రిజిస్టర్‌ను వేరుగా నిర్వహించాలన్నారు. రిజిస్టర్లలో రైతు పేరు, ఫోన్‌నెంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి సౌక ర్యం కల్పించి వర్షాలపై అప్రమత్తం, అవగాహన కల్పిం చి ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ధాన్యం బస్తాపై నెంబర్ వేయాలని, దొడ్డు, సన్న రకాల కేంద్రాలను ఏఈవోలు సందర్శించాలన్నారు. ధాన్యం తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచి, రెండు రకాల ధాన్యం తరలింపునకు వేర్వేరుగా రవాణా చేయాలన్నారు. సన్నబియ్యం కొనుగోలు ను వేగవంతంచేసి, ఓపీఎంఎసలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వానాకాలం పంట కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ఏ కేంద్రంలోనైనా రూ.500 బోన్‌సపై అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, చెక్‌పోస్టు లు, టోకెన్ల జారీ, ప్యాడీ క్లీనర్లు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే, రైతులు టోల్ ఫ్రీ సెల్:7995120554కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, ఆర్డీవో అమరేందర్, డీసీఎసవో వనజాత, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సామ జగదీశ్ కుమార్, డీపీఎం సునీల్ రెడ్డి తదితరులున్నారు.



## మహర్షి వాల్మీకి జయంతి...నివాళులర్పించిన తహసీల్దార్, ఎంపిడిఓ శర్మ





**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 17:** ప్రభుత్వ కార్యాలయాల్లో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్. హరిబాబు, డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఆర్ఐలు సత్యనారాయణ, టీ.రామకృష్ణ, జెఏ నాయక్, వెంకట్ రెడ్డిలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, ఎంపీడీఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపీఓ ఎం. రమేష్, ఉపాధి హామీ పథకం ఎపిఓ కళావతి, జెఏ పోశయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఫిరోజ్, క్రాంతిలు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు తక్కువయ్యింది.. నమోదు చేసుకోవాలి

### తహసీల్దార్ హరిబాబు



**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 17** :- మిర్యాలగూడ మండలంలో ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు తక్కువగా ఉందని వెంటనే నమోదు చేసుకోవాలని స్థానిక తహసిల్దార్ ఎన్.హరిబాబు కోరారు. గురువారం విలేఖరులతో గత ఎమ్మెల్సి ఎన్నికల్లో సుమారు 780 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని ప్రస్తుతం ఇప్పటివరకు కేవలం 50 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు. నవంబర్ 6 వరకు నమోదుకు గడువు ఉందని ఫాం -19 ద్వారా అన్ లైన్ లో గాని ఆఫ్ లైన్ లో గాని ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. నమోదులో నిర్లక్ష్యం వద్దని ఆయన అన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఆర్ఐలు సత్యనారాయణ, టీ.రామకృష్ణలున్నారు.

## మైదానం తోడుగా.. ఉద్యోగ సాధన

**నడిగూడెం-నవభూమి :** వ్యాయామ విద్యను అభ్యసించిన 50 మందికి పైగా నడిగూడెం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వ్యాయామ శిక్షకులుగా రాణిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం నడిగూడెంలో దాత కొల్లు పాపయ్య చౌదరి విరాళంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటమే. నిత్యం వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇక్కడ సాధన చేస్తుంటారు. దీనివల్లే ఎక్కువ మంది పోలీస్ కానిస్టేబుల్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పలు వ్యాయామ ఉద్యోగ నియామకాల్లో నలుగురు ఉద్యోగాలు సాధించారు.



### పంటకాలానికి రైతు బంధు

# రూ.7,500 ఇస్తాం



**నల్గొండ-నవభూమి :** రైతుబంధు పంట కాలానికి రూ.7,500 ఇస్తామని.. ఈ ఏడాది నుంచే పంటల బీమాను కూడా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నల్గొండలోని ఎస్సెల్బీసీ మార్కెట్ యార్డులో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఏ పంట వేసినా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గడిచిన 5 ఏళ్లలో బ్యాంకులో రైతు పేరున ఎంత రుణం ఉన్నా.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ మేరకు 22 లక్షల తెల్లకార్డులు కలిగిన రైతులకు ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేస్తూ వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమ చేస్తామన్నారు. రూ 2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. నల్గొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికంగా ధాన్యం పండుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకొస్తే రూ.24 గంటల్లో కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం తర్వాత నల్గొండలోనే అత్యధికంగా బత్తాయి సాగవుతుందని.. గతంలో ఏర్పాటు చేసిన బత్తాయి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీని ఏర్పాటు చేయాలని తుమ్మల దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. కలెక్టర్ నారాయణోరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.నల్గొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తేమశాతం పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది.హాలియా: స్థానిక లక్ష్మీనర్సింహా గార్డెన్‌లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు,



భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం లాంటి బోగస్ ప్రాజెక్టు కట్టి రాష్ట్రాన్ని రూ.ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేసిందని విమర్శించారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ ఛైర్మన్ పదవి కాదని, అది బాధ్యతని, రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ రైతాంగానికి అండగా ఉండాలని వారు తెలిపారు.ముందుగా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఛాయాదేవి నూతన ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, పీసీసీ డెలికేట్ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా, నందికొండ పురపాలక ఛైర్‌పర్సన్లు యడవల్లి అనుపమరెడ్డి, అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..

**ఆలేరు-నవభూమి :** విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు అవసరం అవుతోంది.విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలామంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.ఉన్నత విద్య కోసం.ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళు తున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పని సరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్‌ను తీసుకుంటున్నారు.లెర్నింగ్‌లైసెన్స్ మాదిరిగానే.రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.భారత్‌లో ఏడాది గడువుతో జారీ అయిన అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (పాతచిత్రం)వీసాను జతచేయాలి.అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికైతే వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్యపరంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్లోనే చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్‌ను జారీ చేస్తారు.నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.అమెరికాలో ఇలా...అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది.

## మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు



**నందికొండ, అక్టోబర్ 16 :** నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా తొణికసలాడుతుండడతో బుధవారం డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎత్తారు. సాగర్‌కు వరద పోటెత్తడంతో ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆగస్టు 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించి సెప్టెంబర్ 19 వరకు విడుదల చేశారు. రెండు విడుతల్లో 435 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు గానూ ప్రస్తుతం 590 (312.0450 టీఎంసీలు) అడుగుల మేర నీటి నిల్వ ఉండడంతో బుధవారం ఉదయం 2 క్రస్ట్ గేట్ల ద్వారా ఎన్నెస్పీ అధికారుల నీటి విడుదలను ప్రారంభించారు. 16,200తో ప్రారంభించి క్రమంగా 8 గేట్లను ఎత్తి 64,800 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను చేపడుతామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.ఎడమ కాల్వ ద్వారా 6,022 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 6,253, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,907, వరద కాల్వ ద్వారా 400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు, జల విద్యుత్ కేంద్రాలు, కాల్వల ద్వారా 1,08,782 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 93,707 క్యూసెక్కులు నమోదవుతున్నది.

## ఉత్తుత్తి ఓపెనింగ్

**నల్లగొండ, అక్టోబర్ 16 :** నల్లగొండ బత్తాయి మార్కెట్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఎంతో ఆర్భాటంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తమ మేలు కోరి మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చారని రైతులు సంతోషడే లోపు అదంతా హంబక్ అని తెలిసి తెల్లబోయారు. ప్రారంభించిన అర గంటకే కొనుగోలు కేంద్రాన్ని ఎత్తేయడంతో అందరూ ఖంగు తిన్నారు.అసలు సెంటరే లేని ప్రాంతంలో మినీ మాక్సీ వాహనంలో నాలుగైదు క్వింటాళ్ల పత్తిని తెప్పించి కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి ఫొటోలకు ఫోజులు ఇచ్చి.. పత్తి రైతులను బురిడీ కొట్టించారు. నల్లగొండ జిల్లా కేంద్ర శివారులోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మంత్రులు హాజరు అవుతున్నారని ఒకరోజు ముందే అధికారులు ఫ్లెక్సీలు, ప్రకటనలు హోరెత్తించారు.బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇద్దరు మంత్రులు ప్రారంభించి వెళ్లారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కనగల్‌కు చెందిన రైతు తాను తీసుకొచ్చిన పత్తిని తిరిగి మినీ మాక్సీ వాహనంలో వేసుకుని తీసుకువెళ్లాడు. కేవలం పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కోసమే తీసుకువచ్చాడని తెలిసి రైతులు ముక్కున వేలు వేసుకున్నారు.అప్రూవల్ రాకుండానే ప్రారంభించేశారు! నల్లగొండ జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పత్తి కొనుగోలుకు టెండర్లు వేశాయి. వాటికి సంబంధించి ఇప్పటి వరకు సీసీఐ యంత్రాంగం ఇన్‌స్టాలేషన్ చేయకుండా పెండింగ్‌లోనే ఉంచింది. వారి పని పూర్తయితే గానీ మార్కెటింగ్ యంత్రాంగం అప్రూవల్ ఇవ్వదు. కొనుగోలు కేంద్రాల ఎంపిక సీసీఐ దగ్గర పెండింగ్‌లో ఉండగా, మంత్రులు మాత్రం ఉత్తుత్తి కేంద్రం ప్రారంభించి పత్తి కొనుగోలు చేస్తున్నట్లు షో చేయడం విడ్డూరం.



# కాంగ్రెసోళ్ల ఇందిరమ్మ కమిటీలు

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్16(నమస్తే తెలంగాణ) :** కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఇస్తామని చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు రాజకీయాలకు అతీతంగా అర్హులైన సామాన్యులకు దక్కడంపై ఆదిలోనే అనుమానాలు మొదలయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో కీలకమంటూ ప్రభుత్వం చెప్తున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటు పూర్తిగా కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో జరుగుతున్నది. గ్రామాలు, వార్డుల వారీగా కాంగ్రెస్ నేతలు సూచిస్తున్న వారినే సభ్యులుగా ఎంపిక చేస్తున్నారు. గ్రామ కమిటీల్లో కీలకమైన చైర్మన్, కన్వీనర్లుగా అధికారులు ఉండగా.. వారికి తెలియకుండానే కమిటీ సభ్యులను ఎంపిక చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది.పూర్తిగా కాంగ్రెస్ నేతలు కూర్చుని గ్రామాల వారీగా జాబితాలను అందజేస్తే వాటికి ఆయా ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో తుది రూపం ఇస్తుండడం గమనార్హం. ఫైనల్‌గా ఎమ్మెల్యేలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక జాబితాలు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా కలెక్టర్లకు చేరుతున్నాయి. కాగా, మూడు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న కమిటీల ఎంపిక ప్రక్రియపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కమిటీల ఎంపిక తీరును చూసి ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకే పరిమితం అవుతాయన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల కమిటీల ఎంపికపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు అవుతుండగా, ఉన్నట్టుండి ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను ఒక్క రోజు తేడాతోనే పూర్తి చేయాలని ఈ నెల 11న ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. తెల్లారితే శనివారం.. అదీ దసరా రోజే తుది జాబితాలు అందజేయాలని పేర్కొంది. ఇంత అర్జెంట్‌గా కమిటీలు ఎలా అని అప్పుడే అధికారులు తలలు పట్టుకున్నారు. ఒకవేళ అదనపు శ్రమతో పూర్తి చేద్దామన్నా తమ చేతిలో ఏమీ లేదు. కమిటీలను నామినేట్ చేసే అధికారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు ఇచ్చినా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.కమిటీల జాబితాలన్నింటినీ తామే సిద్ధం చేసి అందజేస్తామని ఎమ్మెల్యేలు చెప్పారు. దాంతో అధికారులు ఎమ్మెల్యేలు, వారి పీఏలను తుది జాబితాల కోసం బతిమిలాడాల్సి వస్తున్నది. నల్లగొండ కలెక్టర్ మంగళవారమే కమిటీల ఎంపిక పూర్తి కావాలని కింది స్థాయి అధికారులకు డెడ్‌లైన్ విధించినా ఫలితం లేకపోయింది. గ్రామాల వారీగా జాబితాలు తుది దశకు వచ్చినా వాటికి స్థానిక ఎమ్మెల్యేలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. దాంతో ఒకటి, రెండ్రోజులు సమయం పట్టవచ్చని తెలుస్తున్నది.చైర్మన్, కన్వీనర్లకు తెలియకుండానే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి గ్రామ లేదా మున్సిపల్ వార్డు కమిటీలో ఏడుగురు సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసే కమిటీకి సర్పంచ్ లేదా స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామాభివృద్ధిలో కీలకమైన మరో ముగ్గురిని సభ్యులుగా నియమించవచ్చు. ఈ ముగ్గురిలోనూ ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ తప్పనిసరి చేశారు. గ్రామాల్లో కమిటీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో స్పెషల్ ఆఫీసరే చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పంచాయితీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మెజార్టీ గ్రామాల్లో వారితో సంబంధం లేకుండా మిగతా ఐదుగురు సభ్యులను కాంగ్రెస్ నేతలే ఎంపిక చేశారు.ఎక్కువ చోట్ల మండలాల వారీగా కాంగ్రెస్ నేతలు కూర్చుని కమిటీల కూర్పును పూర్తి చేస్తున్నారు. దాంతో ఆయా గ్రామాల వారీగా కాంగ్రెస్ నేతలే ఇందులో సభ్యులుగా ఉండనున్నారు. ఇలా నియమించిన కమిటీల జాబితాను నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల్లో అందజేశారు. అక్కడ ప్రస్తుతం కమిటీలకు తుది రూపం ఇస్తున్నారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీలో ఉండే అంతర్గత విభేధాలతో ఏకాభిప్రాయం రాలేదని, అలాంటి వాటిపై ఎమ్మెల్యేలు తుది నిర్ణయం తీసుకుంటున్నారని తెలుస్తున్నది. ఆ తర్వాతే ఆ కమిటీల తుది జాబితాలను తిరిగి మండలాల్లో ఎంపీడీఓలకు, పట్టణాల్లో కమిషనర్లకు కాంగ్రెస్ నేతలు అందజేస్తున్న పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి జాబితాలను కలెక్టర్ పంపి, ఫైనల్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో తుది కమిటీలను వెల్లడించనున్నారు.కమిటీలదే కీలక పాత్ర.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలదే కీలక పాత్ర కానుంది. కమిటీ ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక మొదలు అవగాహన కార్యక్రమాలు, ఇండ్ల నిర్మాణంలో సలహాలు, సూచనలు, ఫైనల్‌గా సోషల్ ఆడిట్‌ను కూడా కమిటీలే పర్యవేక్షిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హులకు ఇండ్లు దక్కకపోవడం, అనర్హులకు ఇండ్లు వస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత కూడా కమిటీలపై ఉంది. కానీ ఎంపిక దశలోనే కమిటీల్లో పారదర్శకత లోపించడంతో ఎంతవరకు కమిటీల లక్ష్యం నెరవేరుతుందన్న సందేహాలు నెలకొన్నాయి. కమిటీల్లో కాంగ్రెస్ నేతలే కీలకం కావడంతో ఇండ్లను కూడా వారి కార్యకర్తలకే వచ్చేలా చూస్తారన్నది నిజం.దాంతో నిజమైన అర్హులకు ఇండ్లు దక్కుతాయా, లేదా అన్నది అనుమానంగా ఉంది. దీనివల్ల అర్హులు ఈ పథకానికి దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు. రాజకీయ కక్షతో అర్హులైన ఇతర పార్టీల్లోని పేదలకు, ఎవరితోనూ సంబంధం లేని సామాన్యులకు ఇండ్లను దక్కనిస్తారా అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటుపై గ్రామాల్లో విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఏకపక్ష జాబితాలపై విపక్ష నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. పారదర్శకత లేకుండా ఎంపిక చేస్తున్న కమిటీలతో అర్హులకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.నియోజకవర్గానికి 4 వేల ఇండ్లు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రూ.5లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమంలో వివిధ పథకాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులను స్వీకరించింది. ఇండ్ల నిర్మాణం కోసం వేలాది దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిగణలోకి తీసుకుంటారా, లేదా కొత్తగా స్వీకరిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుత ఏడాదికి నియోజకవర్గానికి నాలుగు వేల ఇండ్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 48వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రస్తుతం రానున్నాయి.



# చింతలపాలెంలో కొత్తగా ఆరు అతిసార కేసులు

**మేళ్లచెర్వు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):** చింతలపాలెం మండలకేంద్రంలో బుధవారం మరో ఆరు అతిసార వ్యాధి లక్షణాలు కలిగిన కేసులు నమోదయ్యాయి. ఈ నెల 6వ తేదీన బొడ్రాయిబజార్‌లో అతిసార వ్యాధి లక్షణాలను గుర్తించిన వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమతమై ఇంటింటి సర్వే నిర్వహించి, మెడికల్ క్యాంపు నిర్వహించారు. అయితే అదే ప్రాంతంలో బుధవారం ఆరుగురు వ్యక్తులు స్వల్ప అతిసార వ్యాధి లక్షణాలతో బాధపడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం కోదాడకు తరలించారు. దీంతో డిప్యూటీ డీఎంహెచవో నిరంజన స్థానిక వైద్యసిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు. వైద్యశిబిరాన్ని కొనసాగించాలని ఆదేశించారు. క్యాంపులో మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మి, వైద్యుడు సచిన, సీహెచవో వినోద్, ఆశాలు, ఏఎనఎంలు పాల్గొన్నారు.

